క్లుప్తంగా

రేపు మెగా జాబ్‌మేళా

మదనపల్లె : పట్టణంలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఈనెల 12న హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్‌ఎన్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ), డిగ్రీ (బీ.కాం., బి.ఏ. బీఎస్సీ) పూర్తిచేసిన విద్యార్థులు మెగా జాబ్‌మేళాకు హాజరవ్వచ్చన్నారు. ఇందులో 500 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని, 2020–21, 22, 23లో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ పాల్గొనవచ్చన్నారు.

రూ.22 కోట్ల రుణాలు పంపిణీ చేయడమే లక్ష్యం

తంబళ్లపల్లె: మండలంలో పెద్దమండ్యం, ములకలచెరువు, తంబళ్లపల్లె, పీటీఎం, బి.కొత్తకోట మండలాల్లోని మహిళా సంఘ సభ్యులకు రూ.22 కోట్ల స్త్రీ నిధి రుణాలు పంపిణీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్త్రీ నిధి మేనేజర్ అమరావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ములకలచెరువులో రూ.2.12 కోట్లు, బి.కొత్తకోటలో రూ.56 లక్షలు, తంబళ్లపల్లెలో రూ.3 లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా నటరాజ

పీలేరు రూరల్ : పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వి.జి. నటరాజ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ హెచ్‌ఎంగా పని చేస్తున్న రంగనాథరెడ్డి బదిలీపై పెనుమూరు ఎంఈవోగా వెళ్లారు. ఆయన స్థానంలో ఇదే పాఠశాలలో సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నటరాజ పదోన్నతిపై సోమవారం హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్రస్థాయి కమిటీలో వీఆర్వో ప్రదీప్‌కుమార్ పదవి

రామసముద్రం : ఏపీఆర్‌జేసీ అమరావతి ఆధ్వర్యంలో విజయవాడలోని వీఆర్వో భవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో రామసముద్రం–1 వీఆర్వో జాన్సన్ ప్రదీప్‌కుమార్ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. చౌడేపల్లె, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, పీటీఎం మండలాల్లో వీఏఓగా, వీఆర్వోగా విధులు నిర్వహించిన ప్రదీప్‌కుమార్ రెవెన్యూ అధికారుల సంఘం మదనపల్లె డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మారుమూల మండలంలో పనిచేస్తూ రాష్ట్రస్థాయి కమిటీలో కీలకమైన పదవికి ఎన్నికై నందుకు జాన్సన్ ప్రదీప్‌కుమార్‌ను సోమవారం రామసముద్రం మండల తహసీల్దార్ దైవరాజన్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం–తల్లి బిడ్డ ఆరోగ్యం క్షేమమని డాక్టర్లు కిషోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు అన్నారు. సోమవారం ఎర్రకోటపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య రక్తపరీక్షలు నిర్వహించారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్న, సూపర్‌వైజర్ ముజీబ్‌బాష, రెడ్డెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టు నుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

పెద్దమండ్యం: చెట్టుపై నుంచి వ్యక్తి కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి పంచాయతీ గంగతాతనగారిపల్లె వద్ద సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జి.రామాంజనేయులునాయుడు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గొర్రె పిల్లలకు మేత కోసం రాగి చెట్టు ఎక్కాడు. ఆకు కొడుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. కిందపడిన చోట చెట్టు కొనలు ఉండటంతో గొంతుభాగంలో గుచ్చుకుపోయింది. కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి పనుల తనిఖీ

ములకలచెరువు: మండలంలోని ములకలచెరువు, పాతములకలచెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను జిల్లా అంబుడ్స్ అధికారి శివప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. బిల్లుల మంజూరు, పనుల కల్పనపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తికాగానే వెంటనే డిమాండ్ పెట్టాలని కూలీలకు చెప్పారు. కూలీలు అడిగిన పనులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ నారాయణస్వామి, జేఈ నాగరాజు, సిబ్బంది, కూలీలు ఉన్నారు.

బయోమెట్రిక్ పూర్తి చేయాలి

పీలేరురూరల్ : జగనన్న విద్యాకానుకకు సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ వందశాతం పూర్తి చేయాలని ఎంఈవోలు వై. లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి అన్నారు. సోమవారం మండలంలోని హైస్కూల్, గురుకుల పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో బయోమెట్రిక్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 6,929 మంది విద్యార్థులకు గానూ ఇప్పటి వరకు 4,566 మంది మాత్రమే బయోమెట్రిక్ వేశారని, మిగిలింది పూర్తి చేసి వందశాతం పూర్తి చేయాలని కోరారు.

పవన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు

- అంగళ్లులో ధర్నా, రాస్తారోకో
- దిష్టి బొమ్మ దహనం
- క్షమాపణ చెప్పేవరకు ఆందోళన
- మహిళా కమిషన్‌కు ఫిర్యాదు


కురబలకోట: నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

కురబలకోట: గ్రామ, వార్డు వలంటీర్లు మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారన్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఏలూరు సభ వ్యాఖ్యలపై కురబలకోట మండలంలోని గ్రామ వలంటీర్లు సోమవారం ఒక్కసారిగా భగ్గుమన్నారు. నియోజకవర్గ కూడలి అంగళ్లులో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతేగాకుండా దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. వలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పే వరకు ఆందోళన సాగిస్తామని హెచ్చరించారు. అంతేగాకుండా మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి. దస్తగిరి మాట్లాడుతూ ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పట్ల పవన్ కళ్యాణ్ క్షమాపణ చేపాలన్నారు. ఆయనకు వలంటీర్ల వ్యవస్థ గురించి ఏం తెలుసని విమర్శించారన్నారు. దమ్ముంటే ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. సంక్షేమ వారధులపై నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. అంతకు ముందు మండల జేసీఎస్ కన్వీనర్ ఆర్సీ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను వలంటీర్లు మాయం చేస్తున్నారని చెప్పడానికి పవన్ కళ్యాణ్‌కు సిగ్గులేదా అని విమర్శించారు. కుటుంబ సభ్యుల్లా కలసిపోయి నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్లపై నిందలు వేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. వికృత రాజకీయాలు చేయడం సరికాదన్నారు. రాజకీయాల్లో విమర్శలు హుందాగా ఉండాలన్నారు. వలంటీర్ల సంఘ నాయకుడు అంగళ్లు సందీప్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పేవరకు ఆందోళనలు మరింత తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలు మహిళల గౌరవానికి, భద్రతకు భంగం కల్గించేలా ఉన్నాయని విమర్శించారు. దిగజారుడు మాటలు మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్యాకేజీ స్టార్ డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేశారు. శాంతియుతంగా జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్.ఉమాపతిరెడ్డి, ఫజరుల్లా, ఎస్. రాజశేఖర్ రెడ్డి, చిటికి మధుకర్ రెడ్డి, రాజశేఖర్, అమానుల్లా, ఇస్మాయిల్, జాకీర్, మహబూబ్‌పీరా, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ స్టార్‌కు గుణపాఠం చెబుతాం

పీలేరు : ప్యాకేజీ స్టార్‌గా పేరొందిన పవన్‌కల్యాణ్‌కు తగిన గుణపాఠం చెబుతామని గ్రామ వలంటీర్లు హెచ్చరించారు. గ్రామ వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వాఖ్యలను నిరసిస్తూ సోమవారం పీలేరు పట్టణం అంబేద్కర్ సర్కిల్ నందు గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన దిష్టి


అంగళ్లులో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతున్న వలంటీర్లు

బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా భావించి నిస్వార్థంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరు ఆ కుటుంబ సభ్యులతో కలసి పోయి ప్రతి నిత్యం ప్రతి కుటుంబాన్ని పలకరిస్తున్నామని తెలిపారు. ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని వారి సమస్యను తమ సమస్యగా భావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి వారి సంతోషంలో భాగస్వామ్యులం అవుతున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెలా 1వ తేదీన సూర్యోదయంకు మునుపే వలంటీర్ల సైన్యం అవ్వాతాతలకు పింఛన్లు అందించి వారి కళ్లలో వెలుగులు చూస్తున్నామన్నారు. వలంటీర్ అంటే అర్థం కూడా తెలియని పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజల స్థితిగతులపై ఏమాత్రం అవగాహన లేని అజ్ఞాని అని పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజల మధ్యలో ఉండి సేవ చేసింది వలంటీర్లేనని తెలిపారు. గ్రామవలంటీర్ల గూర్చి మరో సారి దిగజారుడు మాటలు మాట్లాడితే రాష్ట్రంలో ఎక్కడా తిరగనీవ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామవలంటీర్లు, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మహితాఆనంద్, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, నాయకులు షాకీర్, మునీర్, చక్రధర్, చలపతి, వెంకటరమణారెడ్డి, రియాజ్, నాగరాజనాయక్, శ్రీనాథరెడ్డి, అబీద్, ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిగా వాగితే సహించం


తిరుమలరెడ్డిపల్లెలో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

రామసముద్రం: గ్రామ వలంటీర్లపై ఆదివారం వారాహి యాత్రలో పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సోమవారం రామసముద్రంలోని దాదాపు 150 మంది వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. పవన్‌కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థ పైన పిచ్చిపిచ్చిగా మాట్లాడితే సహించేది లేదని మండిపడ్డారు. వలంటీర్ల సేవలు కళ్లకు కనిపించలేదా, కోరోనా మహమ్మారి సమయంలో పవన్‌కళ్యాణ్ ఎక్కడున్నావని , పేద ప్రజల కోసం తాము శ్రమిస్తూ సేవ చేస్తుంటే నీకు నిద్ర పట్టడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.వలంటీర్ వ్యవస్థ జోలికి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల 60 వేల మంది రోడ్లపైకి రావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మేలు జాతి గ్రాసాన్ని సాగు చేసుకోవాలి

వాల్మీకిపురం: పాడి రైతులు మేలు జాతి గ్రాసాన్ని సాగు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నీరజ అన్నారు. సోమవారం వాల్మీకిపురం ఆర్‌బికే 1, మండలంలోని జర్రావారిపల్లి ఆర్‌బికే కేంద్రాల్లో పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడికి ఆధారం పచ్చిమేత అని, పాల ఉత్పత్తిని పెంచడానికి నాణ్యమైన పశుగ్రాసాన్ని సాగు చేసుకోవాలని సూచించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- బాబు పాలనలో అభివృద్ధిని గాలికొదిలేశారు
- వైఎస్ జగన్ పాలనలో పార్టీలకతీతంగా అభివృద్ధి
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: వలంటీర్ల గురించి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి. వలంటీర్ల వ్యవస్థ దేశానికికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థను కొనియాడుతూ వారి రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలనే ఆలోచనతో అక్కడి ప్రభుత్వాలున్నాయన్నారు. వలంటీర్లు మహిళలను ట్రాప్ చేస్తున్నారని పవన్ ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ పాలనలోనే విచ్చలవిడిగా చీకటి కార్యకలాపాలు జరిగాయన్నారు. భార్యలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేసేవారికి మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని చంద్రబాబునుద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసారని ఎద్దేవా చేసారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయన్నారు. అభివృద్ధిలో తంబళ్లపల్లె నియోజకవర్గం రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలచిందన్నారు. నియోజకవర్గంలో ఇంటింటికీ ఫ్లోరైడ్ రహిత మంచినీరు అందించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు. ప్రజలకు అన్ని విధాలా మంచి చేస్తున్న వైఎస్.జగన్‌ను ప్రతి ఒక్కరూ గుండెల్లో పెట్టుకోవాలని కోరారు. నగర పంచాయతీ కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణ కోసం ఎమ్మెల్యే రూ.5.50 కోట్లతో పాటు వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.13 కోట్లు మంజూరు చేయించారన్నారు. మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ మాట్లాడుతూ దశాబ్దాలుగా రోడ్లకు నోచుకోని గ్రామీణ ప్రాంతాలకు తారురోడ్లు వేయించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఎంపీడీఓ శంకరయ్య, జెడ్పీటీసీ రామచంద్ర, పీటీఎం ఎంపీపీ మహమూద్, నగర పంచాయతీ మేనేజర్ రమాదేవి, సర్పంచులు భీమిగాని నాగిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, గిరిజ రఘునాధరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మాజీ సర్పంచు రియాసత్‌అలీఖాన్, సచివాలయాల కన్వీనర్ రెడ్డిహరి, కోఆప్షన్ నాసీర్‌వలీ, బిల్డింగ్ సొసైటీ చైర్మన్ బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న వెంట నడుద్దాం

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : అనుక్షణం పేదల కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెలో సర్పంచ్ వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు శశిధరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిశారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, పొందిన సాయాన్ని లబ్ధిదారులకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు గ్రామాల్లో అవసరమైన సిమెంట్‌రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, మంచినీటి కొళాయిల ఏర్పాటు, పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు, రెవెన్యూ సమస్యలు, అదనంగా విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ప్రజల కోసం పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నవీన్, బ్యాంకుమనోహర, హేమంత్, జయరాం, ఎస్‌ఐ రామకృష్ణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆశ్రమ చిన్నారులకు స్వీట్లు పంపిణీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా సమితి సభ్యులు కర్ణాటక రాష్ట్రంలో కూడా విస్తృతంగా సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంస్థలో సభ్యుడిగా ఉన్న అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన విశ్వనాథ్ పుట్టిన రోజును సోమవారం బెంగళూరులోని జీవిత ఆశ్రమంలో చిన్నారుల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని 60 మంది చిన్నారులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు రాజశేఖర్, మునిస్వామి, మహేష్, అనిల్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత నాణేల ప్రదర్శన

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో సోమవారం హిస్టరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పాత నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత భారతదేశంలో చెలామణిలో ఉన్న నాణేలు, నోట్లు సేకరించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. వీటి గురించి చరిత్ర అధ్యాపకులు కె.ఖాజావలి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు హాజిరాఖానమ్,విష్ణుప్రియ, మోహన్‌వల్లి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న సంఘవి, కవిత

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం మదనపల్లె మండలం శానిటోరియంకు చెందిన విద్యార్థిని సంఘవి, మదనపల్లెకు చెందిన విద్యార్థిని కవితలు హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు.

సుపరిపాలనలో సువర్ణ అధ్యాయం

- అర్హులందరికీ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం
- మేనిఫెస్టోలోని హామీలను 98.5శాతం అమలు చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ
- జగనన్న సురక్షలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా


జగనన్న సురక్షలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల సంక్షేమ పాలనలో అర్హులందరికీ 100 శాతం సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సుపరిపాలనలో సువర్ణ అధ్యాయం దిశగా జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని త్యాగరాజవీధి, దేవళంవీధి, అప్పారావువీధి, అప్పారావుతోట వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. కులం,మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా..లంచాలు, వివక్ష లేకుండా...కేవలం అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వకున్నా, ఇతర పార్టీలకు చెందిన వ్యక్తులన్నా సంక్షేమ పథకాలు, పనులు జరిగేవి కావన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికారులు ఇళ్ల వద్దకు వచ్చి ప్రజలకు కావాల్సిన సేవలు అందించే పరిస్థితి ఉందన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అందులోని ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి వారి అభిమానాన్ని సంపాదించుకుని ప్రజల ముందుకు ధైర్యంగా వెళుతున్న ఏకై క పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా జగనన్న ప్రభుత్వంపై కావాలనే అసత్య ఆరోపణలు, అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలను కళ్లారా చూస్తున్న ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ చంద్రబాబును నమ్మేది లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వై నాట్ 175 అంటూ జగన్‌మోహన్‌రెడ్డిని మనసారా ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం జగనన్న సురక్ష క్యాంపుల్లో 11 రకాల సేవలకు సంబంధించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, నిమ్మనపల్లెషర్మిలాభాను, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, వసీం, రెహమాన్, పాల్‌చంద్రశేఖర్, వినుతాభాయి, జేకేసీ ఇన్‌చార్జ్ బావాజాన్, రహీం తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల మచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముడియంవారిపల్లె పంచాయతీలోని కొత్తపల్లె, గుర్రంవాండ్లపల్లె, ముడియంవారిపల్లె, బోయకొండవారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. నిరుపేదల బలోపేతానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలకు మించి సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. కొత్తపల్లెలో జగనన్న కాలనీలో ఇల్లు కావాలని కోరగా వెంటనే మంజూరు చేయడానికి హౌసింగ్ సిబ్బంది సిఫారస్సు చేశారు. ముడియంవారిపల్లె లోని రెండు వీధులలో మురుగనీటినిల్వ ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా నిర్మాణం కోసం అంచనాలు సిద్ధం చేసి పంపాలని సర్పంచ్ శాంతమ్మకు సూచించారు. గుర్రంవాండ్లపల్లె, బోయకొండవారిపల్లె, ముడియంవారిపల్లె, జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు కావాలని కోరారు. ఆరు గ్రామాలలో 18 దరఖాస్తులు అందగా 12 సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరించారు. వారం లోపు మిగిలిన సమస్యలు పరిష్కరించాలని ఆయాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సిగల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు శాంతమ్మ, జల్లా రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మోహన్‌రాజ, నాయకులు బాబురెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' సమస్యలకు పరిష్కారం

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : జగనన్నకు చెబుదాం–1902 కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను, అందించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని అధికారులకు సూచించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా సహేతుకంగా పరిష్కరించి సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని, పరిష్కరించలేని సమస్యలైతే అర్జీదారులను పిలిచి వారికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో వివరించాలన్నారు. అల్లనేరేడు పండ్ల సేకరణలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వాల్మీకిసంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పులిశ్రీనివాసులు కోరారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో టిడ్కో ఇళ్లకు ఆరేళ్ల క్రితం డబ్బులు చెల్లించామని, టిడ్కో ఇళ్లు ఎప్పుడు ఇస్తారో తెలపాలని చిన్నరెడ్డెప్ప కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బీకే.పల్లె వైఎస్సార్ నగర్‌లో నీటిపైపులైన్ మంజూరుచేయాలని కాలనీవాసులు ఫిర్యాదుచేశారు. సీటీఎం రోడ్డు సిండికేట్ బ్యాంకు వద్ద కాలువను శుభ్రపరచాల్సిందిగా తులసీ ఫిర్యాదు చేశారు. పట్టణ ప్రజలు అందించిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష


రామసముద్రం : ధృవపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు


రెడ్డివారిపల్లెలో ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ నరసింహులు, నాయకులు

రామసముద్రం: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ కుసుమకుమారి , సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి , వైస్ఎంపీపీ రమణారెడ్డి తెలిపారు. సోమవారం మూగవాడి, పెద్దకురప్పల్లె పంచాయతీల్లో సర్పంచ్‌లు రత్నమ్మ, రెడ్డెప్పాయుడుల సమక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురక్ష పథకం క్రింద 11 రకాల సర్వీసులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. సచివాలయ మండల కన్వీనర్ నందరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెలే నవాజ్‌బాషా మండలానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ శైలజ, బీసీ మండల కన్వీనర్ తిమ్మయ్య, నాయకులు కృష్ణారెడ్డి, గెవన్న, సుబ్బారెడ్డి, ఉదయశంకర్‌రెడ్డి, సుజ్ఞానమూర్తి, తిప్పరాజు, ఉప సర్పంచ్ దొరబాబు, మైనార్టీ నాయకులు సర్దార్‌బాషా, రెడ్డివీరేగౌడు, విజయకుమార్, తహసీల్దార్ దైవరాజన్, ఎంపీడీఓ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారని ఎంపీపీ నరసింహులు అన్నారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపు తహసీల్దార్ సీ.ఆర్.మంజుల ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద నిర్వహించారు. సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ చలపతిరావు, నాయకులు నరేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారెప్ప, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీజ డెయిరీ సభ్యులకు రూ.10 కోట్ల బోనస్


మాట్లాడుతున్న శ్రీజ డెయిరీ పర్యవేక్షకులు

కురబలకోట: మహిళలతో నడుస్తున్న శ్రీజ డెయిరీ సభ్యులకు రూ. 10 కోట్లు బోనస్‌గా అందజేసినట్లు చిత్తూరు శ్రీజ ప్రొక్యూర్‌మెంట్ నిర్వాహకులు తిమ్మప్ప అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో జరిగిన పదవ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ 2014లో 27 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ డెయిరీ ఇప్పుడు లక్షకు పైగా సభ్యులున్నారన్నారు. 2022–23లో రూ. 900 కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. రూ. 10 కోట్ల బోనస్ సొమ్మును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. ఈ డెయిరీ ప్రపంచంలోనే అతి పెద్ద మహిళా యాజమాన్య పాల ఉత్పత్తిదారుల సంస్థ అన్నారు.ఈ సందర్భంగా సభ్యులకు ఐదు లీటర్ల స్టీల్ క్యారీలను పంపిణీ చేశారు. జోనల్ మేనేజర్ లింగరావు, పి. కృష్ణప్ప, శంకర్ పాల్గొన్నారు.